క్లుప్తంగా

డీఎస్పీని కలిసిన సీపీఎం నాయకులు



డీఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జీవన్‌రెడ్డిని సీపీఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ ఆశన్న, నాయకులు బండి దత్తాత్రి, అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న ఉన్నారు.

'వేదం'లో విజ్ఞాన మేళా



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న జడ్జి

బోథ్: మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో మంగళవారం విజ్ఞాన మేళా నిర్వహించారు. ఈ మేళాను బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ ప్రారంభించారు. విద్యార్థుల ప్రదర్శనను ఆయన తిలకించారు. ఇన్‌చార్జి ఎంఈవో భూమారెడ్డి, హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముట్టడిని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గాజంగుల రాజు

ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని ఈనెల 29 నిర్వహించే కార్మిక శాఖ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు గాజంగుల రాజు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ముట్టడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నాయకులు, కార్మికులు తరలిరావాలని కోరారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కేసులకు భయపడేది లేదు'



కోర్టు వద్ద ఆదివాసీ సంఘం నాయకులు

బోథ్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలో తమపై కేసులు పెట్టిన సందర్భంగా మంగళవారం బోథ్‌లోని జూనియర్ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. ఎన్ని కేసులు పెట్టినా తాము భయపడేది లేదన్నారు. కోర్టుకు హాజరైన వారిలో కొడప నగేశ్, కుంరం యాదవ్‌రావ్, పెందూర్ అమృత్ కొట్నాక్ పాండు, పెందూర్ అనిల్,పెందూర్ భగవంత్ ఉన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న కృష్ణకుమారి, ఉపాధ్యాయులు

తలమడుగు: మండలంలోని లచ్చంపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లస్టర్ ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణకుమారి, విలాస్‌గౌడ్ దంపతులు మంగళవారం విద్యాసామగ్రి(పరీక్ష ప్యాడ్లు, పెన్నులు) పంపిణీ చేశారు. హెచ్‌ఎం నవీన్‌యాదవ్, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ఉన్నారు.

ప్లేట్ల విరాళం

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన కృష్ణవేణి–సంతోష్ దంపతులు మంగళవారం ప్లేట్ల విరాళంగా అందజేశారు. తమ కుమారుడు రోక్కం సాయికృష్ణ జ్ఞాపకార్థంగా సంతోష్ తల్లి లక్ష్మితో 30 ప్లేట్లను హెచ్‌ఎం శ్రీకాంత్‌కు అందించారు. పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యాయులు ప్రీతమ్, జయసారథి ఉన్నారు.

ఆటాడేదెలా..

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- మూలనపడ్డ క్రీడాసామగ్రి
- ఆటలకు దూరమవుతున్న క్రీడాకారులు



నేరడిగొండ క్రీడా ప్రాంగణం

నేరడిగొండ: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అవసరమైన సామగ్రిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం అన్ని పంచాయతీల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిర్మించింది. గతేడాది సెప్టెంబర్‌లో సామగ్రిని పంపిణీ చేసింది. నిర్వహణపై నిర్ణీత మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో ప్రస్తుతం ఈ క్రీడా సామగ్రి గ్రామ పంచాయతీల్లో మూలనపడి ఉన్నాయి. ప్రభుత్వం క్రీడా సామగ్రి అందజేసిన కొద్ది రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. దీనిపై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడంతో ప్రస్తుతం క్రీడాకారులకు ఉపయోగపడటం లేదు. జిల్లావ్యాప్తంగా 468 గ్రామ పంచాయతీల్లో ఈ క్రీడా సామగ్రిని గత ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే ప్రస్తుతం అవి మూలనపడి ఉన్నాయి. వీటిని క్రీడాకారులకు అందజేస్తే వారు ఆటల్లో మరిన్ని మెలకువలతో రాణించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కిట్లకే పరిమితమైన క్రీడాసామగ్రి

క్రీడాసామగ్రి కిట్లకే పరిమితమైంది. క్రికెట్ కిట్‌తో పాటు వాలీబాల్, నెట్, వ్యాయమం చేసే పరికరాలు, డంబెల్స్ వంటివి పంపిణీ చేశారు. ఇప్పటికే చాలాచోట్ల క్రీడల కోసం కిట్లను తీసుకెళ్లి తిరిగి ఇవ్వకపోవడంతో గ్రామాల్లో వీటిపై పర్యవేక్షణ కొరవడింది.

బోర్డులకే పరిమితం..

గత ప్రభుత్వం చేపట్టిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం అవుతున్నాయి. మొదట్లో వీటి అమలుకు కొంతమేరకు నిధులు ఖర్చుచేశారు. సరిపడా స్థలం లేక గ్రామాలకు దూరంగా క్రీడా ప్రాంగణాలను ఎంపిక చేశారు. చాలాచోట్ల పాఠశాలల ఆవరణలో రాళ్లను తొలగించి వాటిలోనే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో ప్రస్తుతం అక్కడ పిచ్చిమొక్కలు పెరిగి ముళ్లచెట్లకు నిలయంగా మారుతున్నాయి. క్రీడా ప్రాంగణాలు ఉన్నప్పటికీ వీటికి నిర్వహణ కరువైంది. ప్రభుత్వ పాఠశాలల మైదానాలను క్రీడా ప్రాంగణాలుగా చూపి బోర్డులు పెట్టడంతో బయటి యువకులకు ఆటలకు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలు, క్రీడా సామగ్రిపై మరింత పర్యవేక్షణ పెంచి గ్రామీణ క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అనుకూలంగా లేదు



పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఆటలాడేందుకు అనుకూలంగా లేవు. ప్రస్తుతం అక్కడ ముళ్లపొదలు పేరుకుపోవడం, రాళ్లురప్పలు ఉండడంతో ఆటలాడే పరిస్థితి లేదు. మైదానాన్ని చదును చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలి. దీంతో గ్రామీణ ప్రాంత యువకులు ఆటల్లో రాణించే అవకాశం ఉంటుంది.

– గస్కంటి గంగాధర్, కోచ్, నేరడిగొండ

వినియోగంలోకి తీసుకొస్తాం



ఆయా పంచాయతీల పరిధిలో క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకొస్తాం. పంచాయతీ సిబ్బందితో మైదానాలను చదును చేయిస్తాం. అక్కడ క్రీడలు ఆడేవిధంగా చూస్తాం. దీంతోపాటు క్రీడా సామగ్రిని సైతం క్రీడాకారులకు అందించేలా చర్యలు చేపడతాం.

– రాజ్‌వీర్, ఎంపీడీవో, నేరడిగొండ

పాఠాలు అర్థం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

జైనథ్: విద్యార్థులు బట్టీపట్టే విధానానికి స్వస్తి పలకాలని డీఈవో ప్రణీత అన్నారు. మండలంలోని మేడిగూడ-ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పాఠాలను చదివి అర్థం చేసుకుని చదవడం అలవర్చుకోవాలన్నారు. దీనివల్ల విశ్లేషణ సామర్థ్యం పెరగడంతోపాటు చదివిన అంశం గుర్తుంటుందన్నారు. సెక్టోరియల్ అధికారి జెట్టి నారాయణ, హెచ్‌ఎం సత్యవాన్ చిక్టే, ఉపాధ్యాయులు వసుధ, మంజూష, సంతోష్, నాందేవ్, దేవదాస్, కృష్ణమూర్తి ఉన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. జిల్లాకేంద్రంలోని కాటన్ మార్కెట్ ప్రాంతానికి చెందిన ఎల్.విశాల్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌వోసీని ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం బాధిత కుటుంబానికి అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న రోగులకు సీఎం సహాయనిధి వరంలాంటిందన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం తరగతి గదుల్లో హాల్ టికెట్ నంబర్లు వేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతించమన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. డీవో స్వర్ణ, అధ్యాపకులు నరేశ్, కాంబ్లె బాలాజీ ఉన్నారు.

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్



మాక్ యూత్ పార్లమెంట్ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన యూత్ మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. ముందుగా జాతీయ గీతాన్ని ఆలపించారు. పార్లమెంట్‌ను తలపించే విధంగా విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. శృతిక రాష్ట్రపతిగా, మిర్జా సోహెల్ బేగం ప్రధానమంత్రిగా, ఆర్యన్ ప్రతిపక్ష నేతగా, విశల్ స్పీకర్‌గా వ్యవహరించారు. పార్లమెంట్‌లో మాదిరిగానే బిల్లులు ప్రవేశపెట్టడం, వాటిపై చర్చలు, ప్రతిపక్ష నేతల వాదోపవాదాలు తదితర అంశాలను కళ్లకు కట్టే విధంగా ప్రదర్శించారు. పార్లమెంట్ సమావేశాలు, చట్టాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. లెక్చరర్లు ప్రభాత్‌రావు, గోపాల్, నందిని, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవడంతోనే ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని శివాలయ కలశ శోభాయాత్రలో మంగళవారం ఆయన భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఇచ్చోడ: అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని బోరిగామలో రెడ్డి సంక్షేమ భవనం నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో మౌలిక వసతులు కల్పించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తానన్నారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు గాడ్గే సుభాష్, నర్వడే రమేశ్, తృప్తి గంగాధర్, పాండురంగ్, తిరుమల్‌గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణపై వర్క్‌షాప్



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న మహిళలు

బోథ్: రాష్ట్ర ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో మహిళలు, యువతకు వేర్వేరుగా నైపుణ్య శిక్షణపై మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, డీడబ్ల్యూవో సబిత, ఏపీసీసీ కోఆర్డినేటర్ సత్యం, శిక్షణ నిర్వాహకులు ఉన్నారు.

108లో ప్రసవం

సిరికొండ: మండలంలోని చింతగూడలో మంగళవారం గర్భిణి రూపబాయి పురిటినొప్పులతో బాధపడుతుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అంబులెన్స్‌లో ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు అధికమయ్యాయి. మార్గమధ్యన చిమ్మన్‌గూడ వద్ద అంబులెన్స్‌లో పురుడు పోయగా పాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను పిట్టబోంగారం పీహెచ్‌సీకి తరలించినట్లు, ఈఎంటీ సురేష్, పైలెట్ గోపినాథ్ తెలిపారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

గుడిహత్నూర్: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక బుధవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. కాగా, ఎంపీపీ పుండలీక్ కరోనా సమయంలో అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. వైస్ ఎంపీపీ భరత్‌కు ఎంపీపీ బాధ్యతలు అప్పగించారు. ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని ఈనెల 19న ప్రభుత్వ ఉత్తర్వుల జారీతో సిబ్బంది అన్నిఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సదానందం ఓ ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్, రాణిసతీజి కాలనీ, అశోక్ రోడ్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

సీపీఐకి రాజీనామా

బోథ్: మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు షేక్ షాకీర్ సీపీఐ సభ్యత్వానికి, పార్టీ సహాయ కార్యదర్శి పదవికి మంగళవారం రాజీనామా చేశారు. కాగా, ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది.

సోయా కొనుగోలు చేసే వరకు ఉద్యమిస్తాం



మార్కెట్ యార్డులో పంటలను పరిశీలిస్తున్న మెట్టు ప్రహ్లాద్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో సోయాబీన్ కొనుగోళ్లు ప్రారంభించి మూడు రోజులవుతున్నా రైతుల వద్ద నుంచి ఒక్క గింజ కొనుగోలు చేయలేదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. మంగళవారం ఆయన మార్కెట్ యార్డును సందర్శించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు ఇబ్బంది లేకుండా పంటలు కొనుగోలు చేశామన్నారు. ఈనెల 24న సోయా కొనుగోలు ప్రారంభించినప్పటికీ రైతుల నుంచి కొనుగోలు చేయకపోవడం సరికాదన్నారు. పంటను కొనుగోలు చేసే వరకు ఉద్యమిస్తామన్నారు. ఆదిలాబాద్ ఎంపీపీ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, జగదీశ్, రాజు తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేయొద్దు

జైనథ్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని రైతుబంధు మాజీ మండల కన్వీనర్ సర్సన్ లింగారెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన రైతులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులోని సోయా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కరోజు మాత్రమే సోయా కొనుగోలు చేసి నిలిపివేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతుల ఇంటి వద్దకే వెళ్లి, ప్రతీ గింజను కొనుగోలు చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ తీరు మారాలని లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎంపీటీసీ కోల భోజన్న, మాదస్తు వెంకన్న, రైతులు తదితరులు ఉన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

బోథ్: సొనాలలోని వివేకానంద పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలగం ఫేమ్ కొమురయ్య(సుధాకర్ రెడ్డి) హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఆయన ప్రసంగం బలగం సినిమాలో మాట్లాడిన యాసలోనే సాగింది. పల్లెటూరి యాస, భాషను మరవద్దన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకుంది. సీఐ రమేశ్, ఎస్సై రాము, హెచ్‌ఎం కృష్ణచైతన్య, కరస్పాండెంట్ ఇస్తారి, డైరెక్టర్లు శుద్ధోధన్, శ్రీధర్, హరీశ్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని జోసెఫ్ కాన్వెంట్ పాఠశాల విద్యార్థులు కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం చేశారు. బేల మండలంలోని సోన్‌కాస్ గ్రామానికి చెందిన ఆడే రాజారాం కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు రూ.50వేల నగదును మంగళవారం ఆయనకు అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సిస్టర్ లెజండో, పీడీ వినోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



దేహగామలో నల్లాను పరిశీలిస్తున్న ఎంపీడీవో

తలమడుగు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శేఖర్ ఆన్నారు. మండలంలోని కోసాయి, దేహగామ, తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. మిషన్ భగీరథ నల్లా నీరు సక్రమంగా రావడం లేదని ఇబ్బందవుతుందని గ్రామస్తులు ఎంపీడీవోకు విన్నవించారు. భగీరథ పనులు త్వరగా పూర్తిచేసి తాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. అదేవిధంగా పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో నూతన పంచాయతీ భవన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంపీఓ వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

సేవా దృక్పథంతో ముందుకు సాగాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆపదలో ఉన్నవారికి ప్రతిఒక్కరూ తమకు సాయం అందించి సేవా దృక్పథంతో ముందుకుసాగాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్ అన్నారు. ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఉర్దూ భవన్‌లో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేసిన వారిని సన్మానించారు. షేక్ షఫీక్ అహ్మద్, అథర్, ఇమ్రాన్, అస్లమ్ ఖాన్, సాజిద్, రిజ్వాన్ ఖాన్, వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమికోన్నత పాఠశాలలో స్వాతంత్ర పోరాటయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మహేశ్, ఉపాధ్యాయులు శంకర్, వికేష్, సంధ్య, వీరకుమార్ ఉన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఖానాపూర్: పట్టణ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించాలని కమిషనర్ టి.మనోహర్ కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.59లక్షల పన్నులు బకాయిగా ఉన్నాయని పేర్కొన్నారు. అంతకుముందు కాలనీల్లో సిబ్బంది ఇంటింటికీ తిరిగి పన్నులు వసూలు చేశారు.

పట్టుదలతో చదవాలి



మాట్లాడుతున్న సీఐ భీమేశ్

గుడిహత్నూర్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. మండలంలోని మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులకు క్రమశిక్షణతో కూడిన విద్య అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాఠశాల విద్య అనేది వ్యక్తి వికాసానికి పునాదిలాంటిదని అన్నారు. బాలల సంరక్షణాధికారి స్వామి మాట్లాడుతూ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. హెచ్‌ఎం సంతోష్ కుమార్, సమన్వయ కర్త కోటేశ్వర్, ఎంపీటీసీ జ్ఞానేశ్వర్, వీడీసీ చైర్మన్ వినోద్, గ్రామపెద్దలు ఉన్నారు.

చేవెళ్ల సభకు తరలిన నాయకులు



బస్సులో వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: చేవెళ్లలో మంగళవారం నిర్వహించిన జన జాతర సభకు కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఎంపీటీసీలు రజియా బేగం, మహేందర్, నాయకులు నాజర్ అహ్మద్ తదితరులు వెళ్లారు.